https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 4 ఆదివారం 26-4-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా
రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో
పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

# మారిన మనిషి.. మరమనిషి



## కేసీఆర్ రాజకీయ పరిణతి కోల్పోయి మాట్లాడుతున్నారు

**అవినీతి చేసిన పందికొక్కులను పక్కనే పెట్టుకొని.. నన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు.**

**3.5 కోట్ల మందికి అమ్మనవుతా**

**మునీరాబాద్ సభలో కవిత**

**పార్టీ పేరు 'తెలంగాణ రాష్ట్ర సేనగా' ప్రకటన**

**పసుపు, నీలం, ఆకుపచ్చ రంగులతో పార్టీ జెండా**

**కేటీఆర్‌కు పెద్దగా ఏమీ తెలియదని తీసిపారేసిన కవిత**

హైదరాబాద్, మేడ్చల్, ఏప్రిల్ 25

"బీఆర్ఎస్ కోసం నా చెమట, రక్తం, సమయం ధారపోసి పనిచేశా. కష్టపడి తెలంగాణ తెచ్చుకున్నం. కానీ, మనం కలలు కన్న తెలంగాణ రాలేదు. మన కలలు ఇప్పటికీ నిజం కాలేదు. కేసీఆర్ ఆధ్వర్యంలో ఉద్యమ రథం దారి తప్పింది. సామాజిక రథ చక్రం విరిగి ముక్కలైంది. ఆనాటి కేసీఆర్ వేరు. ఈనాటి కేసీఆర్ వేరు. ఆనాడు చేనేత కార్మికులు చనిపోతే.. బిచ్చమెత్తి సాయం చేసిన వ్యక్తి కేసీఆర్. ఈనాటి కేసీఆర్ మర మనిషి, మారిన మనిషి" అంటూ తండ్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన మన మనిషి కాదని, గుంట నక్కలు, తోడేళ్ల చేతిలో బందీగా ఉన్నారని, ఆత్మ లేని మరబొమ్మగా మారారని ఆక్షేపించారు. ఇవి సంతోషంతో చెబుతున్న మాటలు కాదని, దుఖంతో చెబుతున్న మాటలని అన్నారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో శనివారం ఉదయం పార్టీ ఆవిర్భావ సభను నిర్వహించారు. తమ పార్టీ పేరును తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్)గా ప్రకటించారు. అనంతరం సభలో మాట్లాడుతూ.. ఈరోజు తన జీవితంలో మరచిపోలేని రోజు అవుతుందని చెప్పారు. బీఆర్ఎస్‌లో ఆత్మ పోయిందని, అందుకే తన పార్టీకి తెలంగాణ రాష్ట్ర సేన అనే పేరు పెట్టానని చెప్పారు. 'బీఆర్ఎస్ నుంచి కేసీఆర్ తొలి ముఖ్యమంత్రి అయ్యారు. మంచి సాలు తీయాల్సి ఉండె. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో తెచ్చుకున్న తెలంగాణలో పదేళ్లలో నీళ్ల కోసం బీఆర్ఎస్ లక్షా 89 వేల కోట్లు ఖర్చు చేసింది. కేవలం 14 లక్షల ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చింది. పాలమూరు, కాళేశ్వరం ప్రాజెక్టుల కోసమే లక్షా 21 వేల కోట్లు ఖర్చు చేసింది. కేంద్రంతో గొడవ పెట్టుకోకపోయి ఉంటే పాలమూరు- రంగారెడ్డి పూర్తయ్యేది" అని వ్యాఖ్యానించారు.



**పిల్లలు తప్పు చేస్తే వదిలేస్తామా!?**

ప్రజలకు కష్టం వస్తే కూడా కేసీఆర్ బయటకు రావడం లేదని, 'అయ్యా కేసీఆర్ రావాలి' అని పిలిచినా రావట్లేదని కవిత తప్పుబట్టారు. "వెలుగుమట్లలో, హైదరాబాద్‌లో ఇళ్లు కూల్చేస్తే వచ్చారా!? 'అయ్యా కేసీఆర్' రావాలి అంటే కూడా రాలేదు. నాడు ఆర్డీఎస్ కోసం పాదయాత్ర చేశారు. కానీ, పాలమూరు కోసం ఏమీ చేయలేదు. ఆనాటి కేసీఆర్ అయితే అక్కడే కుర్చీ వేసుకొని దాన్ని పూర్తి చేసేవారు. ఆనాటి కేసీఆర్ వేరు. ఈనాటి కేసీఆర్ వేరు. నాడు చేనేత కార్మికులు చనిపోతే బిక్షమెత్తి సాయం చేశారు. సింగరేణి గనిలో కార్మికుడు చనిపోతే చూసి వచ్చారు. ఇప్పుడు ఎక్కడ చిన్న కష్టం వచ్చినా ఆ సారు రారు. చేవెళ్ల దగ్గర కష్టమ్మస్త వచ్చారా? ఇప్పుడు ఆయన మారిన మనిషి. మర మనిషి. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఆ ప్రేమ ఏమైంది!? అధికారం ముందు మమకారం తగ్గిపోయిందా!?" అని నిలదీశారు. ఎప్పుడైతే అధికారం వచ్చిందో అప్పుడే బీఆర్ఎస్‌లో అమ్మతనం, మమకారం పోయిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కర్కోటక పాలకుడి పాలన నడుస్తోందని, అర్ధరాత్రి ఇళ్లు కూలగొడుతుంటే ఆదుకోవాల్సిన మన పాత కేసీఆర్ ఎక్కడ ఉన్నాడని నిలదీశారు. తనను ఓడించడం ద్వారా ప్రజలు తప్పు చేశారని కేసీఆర్ అంటున్నారని, మన పిల్లలు తప్పు చేస్తే వదిలేస్తామా!? అని నిలదీశారు. కేసీఆర్ రాజకీయ పరిణతి కోల్పోయి మాట్లాడుతున్నారని విమర్శించారు. మారిన కేసీఆర్ పంజాబ్,గుజరాత్, బిహార్‌కు పోయారని, రాష్ట్రంలో మొత్తం పీకి కట్టలు కట్టామని నేషనల్ పార్టీ అంటూ వెళ్లారని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణ ప్రజలను పట్టించుకోలేదని, పట్టించుకుని ఉంటే పాలమూరు రంగారెడ్డి పారకపోయేదా!? అని ప్రశ్నించారు. ఇక, కేటీఆర్‌కు పెద్దగా ఏమీ తెలియదని కవిత తీసిపారేశారు.

# బకాసుర పార్టీ.. బీజేపీ

**ఎంత తిన్నా ఆకలి తీరదు**

**శివసేన (ఉద్ధవ్‌థాకరే) నేత సంజయ్‌రౌత్..**



**ముంబై, న్యూఢిల్లీ, ఏప్రిల్ 25:**

ఒక్క రోజులో ఏకంగా ఏడుగురు రాజ్యసభ ఎంపీలు బీజేపీలోకి వెళ్లిపోయిన నేపథ్యంలో.. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి పలు విపక్ష పార్టీలు సంఘీభావం ప్రకటించాయి. శివసేన (ఉద్ధవ్‌థాకరే) నేత సంజయ్‌రౌత్.. బీజేపీని బకాసురునితో పోల్చారు. మహాభారతంలో బకాసురుడనే రాక్షసుడికిఎంత తిన్నా తీరనంత ఆకలి ఉంటుందని, ప్రస్తుతం బీజేపీ కూడా అలాగే తయారైందన్నారు. బీజేపీకిలోకి ఫిరాయించిన ఏడుగురు ఆప్ ఎంపీలు పేజ్ 3 నాయకులని (మీడియాలో కనిపించే సెలబ్రిటీలు), ఆర్థిక ప్రయోజనాలు కాపాడుకునేందుకే వాళ్లు పార్టీ మారారని ఆరోపించారు. అన్ని పార్టీల్లో ఉన్న చెత్త అంతా ఈ విధంగా బీజేపీలోకి వెళ్లిపోవటమే మంచిదని, దీంతో బీజేపీ డంపింగ్‌యార్డుగా మారుతుందన్నారు. బీజేపీలోకి ఫిరాయించిన ఆప్ ఎంపీ రాఘవ్‌చద్దా.. ఒకప్పుడు బీజేపీని గూండాల పార్టీగా అభివర్ణించారని గుర్తు చేశారు. చద్దాతోపాటు పార్టీ మారిన మరో ఆప్ ఎంపీ, లౌలీ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు అశోక్ మిత్తల్‌పై ఈడీ దాడులు జరిగిన నేపథ్యాన్ని ప్రస్తావిస్తూ.. బీజేపీ రాజకీయాలు ఎంత సిగ్గుమాలినవో అందరికీ తెలుసన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల భారత్‌ను నరకంతో పోల్చిన విషయాన్ని పేర్కొంటూ.. నరకం అంటే ఎలా ఉంటుందో బీజేపీ చూపిస్తోందని రౌత్ విమర్శించారు. తన ను కూడా మనీల్యాండరింగ్ పేరుతో ఓ తప్పుడు కేసులో ఇరికించి, బీజేపీలోకి రావాలని తీవ్ర ఒత్తిడి తెచ్చారని, జైలుకు వెళ్లటానికైనా సిద్ధమేగానీ.. పార్టీకి ద్రోహం చేయనని చెప్పానని రౌత్ పేర్కొన్నారు. 2022లో రౌత్ సదరు కేసులో అరెస్టై జైలుపాలైన సంగతి తెలిసిందే. ఇండియా కూటమికి చెందిన మరో పార్టీ డీఎంకే కూడా ఈ పరిణామాలపై తీవ్రంగా స్పందించింది. భారతదేశంలోనే అత్యంత నీచమైన రాజకీయ పార్టీ బీజేపీ అని డీఎంకే అధికార ప్రతినిధి ఇళన్ గోవన్ పేర్కొన్నారు. 'అధికారంలోకి రావటానికి వాళు ఎలాంటి తప్పుడు పనులకైనా, రాజ్యాంగ వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక కార్యకలాపాలకైనా పాల్పడుతారు. ఎంపీలను, ఎమ్మెల్యేలను పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తారు. పలు రాష్ట్రాల్లో బీజేపీలో ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇతర పార్టీలకు చెందినవారేనని విషయం దీనిని నిరూపిస్తోంది' అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్‌లో స్పందిస్తూ.. 'మోదీ వాషింగ్ పౌడర్‌తో బీజేపీ వాషింగ్ మెషిన్ మళ్లీ వచ్చింది. సిద్ధాంతం, నైతికత అని కబుర్లు చెప్పేవారి అసలు స్వరూపం బట్టబయలైంది' అని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, పార్టీ ఫిరాయించిన ఏడుగురు ఎంపీలపై అనర్హత వేటు వేయాలని రాజ్యసభ చైర్మన్‌ను కోరుతామని ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ శనివారం పునరుద్ఘాటించారు.

# 47 మంది మావోయిస్టుల లొంగుబాటు

**డీజీపీ సమక్షంలో లొంగిపోయిన దక్షిణ బస్తర్.. డివిజన్ కమిటీ ఇన్‌చార్జి హేమ్లా ఐతు బృందం**

**ఆ పార్టీలో మిగిలిన తెలంగాణ వారు నలుగురే**

**ఆయుధాల డంప్‌ల కోసం గాలిస్తున్నాం: డీజీపీ**



**హైదరాబాద్, ఏప్రిల్ 25**

ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 47మంది మావోయిస్టులు డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో శనివారం లొంగిపోయారు. దక్షిణ బస్తర్ డివిజన్ కమిటీ ఇన్‌చార్జి హేమ్లా ఐతు అలియాస్ విజ్జా తన బృందంతో కలిసి లొంగిపోవడంతో దక్షిణ బస్తర్ డివిజన్ కమిటీ, పీఎల్‌జీఏ బెటాలియన్-1 కనుమరుగైనట్టేనని డీజీపీ తెలిపారు. వీరి లొంగుబాటుతో ఛత్తీస్‌గఢ్ సైతం మావోయిస్టు రహిత రాష్ట్రమైందని, తెలంగాణలోనైతే ఒక్క మావోయిస్టు కూడా అడవుల్లో లేరని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన మావోయిస్టు పార్టీ అగ్రనేత కేంద్ర కమిటీ సభ్యుడు గణపతి ఆయన భార్య రత్నాభాయి, ఒడిశాలో పనిచేస్తున్న కేంద్ర కమిటీ సభ్యుడు పసునూరి నరహరి అలియాస్ సంతోష్, రాష్ట్ర కమిటీ సభ్యుడు వార్తా శేఖర్ అలియాస్ మంగ్తు మాత్రమే జనజీవన స్రవంతిలో కలవాల్సి ఉందన్నారు. గణపతి ఆయన భార్య మాత్రం అడవుల్లో లేరన్న సమాచారం ఉందన్నారు. 2023లో కేంద్ర, రాష్ట్ర కమిటీల్లో తెలంగాణకు చెందిన వారు 125 మంది ఉంటే ప్రస్తుతం నలుగురే మిగిలారని వివరించారు. శనివారం లొంగిపోయిన వారికి తాత్కలికంగా ఒకొక్కరికి రూ. 25వేలు ఇచ్చామని, బ్యాంకు ఖాతాలు తెరిచిన తర్వాత నిబంధనల ప్రకారం వారిపై ఉన్న రివార్డులు అందజేస్తామని చెప్పారు. మావోయిస్టుల ఆయుధాల డంప్‌ల కోసం బలగాలు అడవులను జల్లెడ పడుతున్నాయని తెలిపారు. తెలంగాణను మావోయిస్టురహిత రాష్ట్రంగా ప్రకటించడానికి కృషి చేస్తున్న అధికారులను డీజీపీ ప్రశంసించారు. మావోయిస్టు పార్టీ పేరిట విడుదలైన లేఖ ఉత్తరాది నుంచి వచ్చినట్లు అనుమాని స్తున్నామని తెలిపారు.

## నీతి ఆయోగ్ వైస్ చైర్మన్‌గా అశోక్‌కుమార్ లాహిరి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25

దేశ అత్యున్నత విధాన నిర్ణాయక సంస్థ అయిన నీతి ఆయోగ్‌ను కేంద్రప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. పశ్చిమబెంగాల్‌లో బీజేపీ ఎమ్మెల్యే, కేంద్రప్రభుత్వ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు డాక్టర్ అశోక్ కుమార్ లాహిరిని నీతి ఆయోగ్ వైస్ చైర్మన్‌గా నియమించింది. పూర్తిస్థాయి సభ్యులుగా ఎయిమ్స్ డైరెక్టర్ ఎం.శ్రీనివాస్, క్యాబినెట్ మాజీ కార్యదర్శి రాజీవ్ గౌబా, ప్రముఖ శాస్త్రవేత్తలు కె.వి.రాజు, డాక్టర్ గోబర్ధన్ దాస్, కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి అభయ్ కరందీకర్‌లను నియమించింది. ప్రధాని మోదీ శనివారం సాయంత్రం ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని ప్రకటించారు. నీతి ఆయోగ్ సభ్యులుగా నియమితులైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా.. అశోక్‌కుమార్ శనివారం మోదీని కలిశారు.

# చర్చలపై పీటముడి..

**పాకిస్థాన్‌కు వచ్చి వెళ్లిపోయిన అరాగ్చీ**

**ఆ దేశ ప్రధాని, సైన్యాధ్యక్షుడితో సమావేశం**

**మరోవైపు, అమెరికా ప్రతినిధుల పర్యటన రద్దు**





**ఇస్లామాబాద్/ వాషింగ్టన్, ఏప్రిల్ 25:**

అమెరికా- ఇరాన్ మధ్య రెండోదఫా చర్చలపై పీటముడి వీడటం లేదు. ఆదివారం చర్చలు ఉంటాయని అంతా భావిస్తున్న సమయంలో ఎటువారు అటే ఆగిపోయారు. శుక్రవారం రాత్రి పాకిస్థాన్‌కు వచ్చిన ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ.. పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్, సైన్యాధ్యక్షుడు అసిమ్ మునీర్‌ను కలిసి శనివారం తిరిగి వెళ్లిపోయారు. అబ్బాస్ పాక్ రావటంతో చర్చల కోసం తమ ప్రతినిధులు జారెడ్ కుష్నర్, స్టీవ్ విట్‌క్ష?ఫను కూడా పంపుతున్నట్లు ప్రకటించిన అమెరికా.. చివరి నిమిషంలో వారి పర్యటనను రద్దుచేసింది. దీంతో చర్చల ప్రయత్నాలకు విఘాతం కలిగింది. అంతకుముందు తాము అమెరికా ప్రతినిధులతో నేరుగా చర్చలు జరుపబోమని ఇరాన్ ప్రకటించింది. తమ అభిప్రాయాలను, ఆందోళన ను పాకిస్థాన్ ప్రతినిధులకు చేరవేస్తామని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఎస్మాయిల్ బఖయి శనివారం ట్వీట్ చేశారు. కానీ, ఇరాన్ నేతలతో నేరుగా చర్చలు జరిపేందుకు కుష్నర్, విట్‌క్ష?ఫలను పంపుతున్నట్లు ట్రంప్ రాయిటర్స్ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. అబ్బాస్ మధ్యలోనే స్వదేశానికి వెళ్లిపోయిన తర్వాత ట్రంప్ ఫాక్స్ న్యూస్ వార్తా సంస్థతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'పాక్‌కు వెళ్లేందుకు మావాళ్లు సిద్ధమయ్యారు. అయితే, కొద్దిసేపటి క్రితమే వారికి అక్కడికి వెళ్లవద్దని చెప్పాను. ఏ ప్రయోజనమూ లేనిదానికి 18 గంటలపాటు ప్రయాణం చేసి వెళ్లాల్సిన అవసరం లేదని చెప్పాను. మావద్ద అన్ని రకాల కార్డులు ఉన్నాయి. వాళ్లకు (ఇరాన్) ఇష్టమైనప్పుడే మాకు కాల్ చేయనివ్వండి' అని పేర్కొన్నారు.

**మలక్కాలోనూ టోల్ వసూలు: ఇండోనేషియా**

హోర్ముజ్‌లో వాణిజ్య నౌకల నుంచి ఇరాన్ టోల్ వసూలు చేస్తున్నట్లు ప్రకటించటంతో మలక్కా జలసంధి నుంచి వెళ్లే నౌకల నుంచి తాము కూడా టోల్ వసూలు చేస్తామని ఇండోనేషియా ఆర్థిక మంత్రి పర్బయా యుధి సదెవా శనివారం ప్రకటించారు. ఈ జలసంధి ఇండోనేషియా, మలేషియా, సింగపూర్ సరిహద్దుల్లో ఉంది. మరోవైపు, ఇరాన్ నుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనాకు చెందిన దాదాపు 40 సంస్థలు, చమురు ట్యాంకర్లు, చమురు శుద్ధి కేంద్రాలపై కఠిన ఆంక్షలు విధించనున్నట్లు అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ప్రకటించారు. ముఖ్యంగా అత్యధికంగా ఇరాన్ ముడి చమురును కొనుగోలు చేస్తున్న హెంగ్లి పెట్రోకెమికల్ రిఫైనరీపై తొలిగా ఆంక్షలు విధించినట్లు చెప్పారు. కాగా, ఇరాన్ ప్రభుత్వం టెహ్రాన్ విమానాశ్రయం నుంచి శనివారం పౌర విమాన సర్వీసులను ప్రారంభించింది.

## అమిత్‌షాపై లీగల్ కేసు వేస్తా మమతా బెనర్జీ



**హుగ్లీ:**

పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత పోలింగ్ ప్రచారంలో రాజకీయ ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన హింసాత్మక వ్యాఖ్యలపై లీగల్ కేసు వేయనున్నట్టు పశ్చిమబెంగాల్ మమతా బెనర్జీ తెలిపారు. హుగ్లీలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆమె మాట్లాడుతూ, ఎన్నికలు ముగిసిన తర్వాత టీఎంసీ కార్యకర్తలను 'తలకిందులుగా వేలాడదీస్తాం' అంటూ అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు ఒక హోం మంత్రి స్థాయికి తగవని, ఇలాంటి దురుసు పోగడలతో బెంగాల్ ఓటర్ల మనసులు గెలుచుకోలేరని అన్నారు.

# బీఆర్ఎస్ దోపిడీలో కవితకూ భాగస్వామ్యం

**దానిపై ఎందుకు వివరణ ఇవ్వలేదు?: మహేశ్‌కుమార్ గౌడ్**



**హైదరాబాద్, ఏప్రిల్ 25**

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన దోపిడీలో కవితకూ ప్రత్యక్ష భాగస్వామ్యం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ ఆరోపించారు. ఆ దోపిడీపై కవిత ఎందుకు వివరణ ఇవ్వడంలేదని ప్రశ్నించారు. తెలంగాణలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్ని కొత్త పార్టీలు వచ్చినా తమకు అభ్యంతరమేమీ లేదని, కవిత కొత్త పార్టీ పెట్టడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. కేసీఆర్ చుట్టూ గుంటనక్కలు ఉన్నాయా లేక పందికొక్కులు ఉన్నాయా అనే విషయం పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు కవితకు తెలియదా అని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డిపై ఆమె చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా అర్ధరహితమన్నారు. రాష్ట్రంలో మహిళా కేంద్రంగా ప్రజాపాలన సాగుతోందని, మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కేటీఆర్‌కు రాజకీయం తెలియదని కవిత చేసిన వ్యాఖ్యల్లో నిజం ఉండొచ్చని చమత్కరించారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు మౌనంగా ఉన్న కవిత.. ఇప్పుడు బయటకు రావడం వెనుక దోచుకున్న సొమ్ము పంచుకోవడంలో వచ్చిన తేడాలే కారణమని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డిని కర్కోటకుడు, హిట్లర్ అని విమర్శిస్తే కవితకు మార్కులు పడవని, ఆమె ఎన్ని నాటకాలు ఆడినా ప్రజలు నమ్మరని ఆయన అన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో జరిగిన వేల కోట్ల అవినీతిని కవిత పరోక్షంగా అంగీకరించారని కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని తాము మొదటి నుంచీ చెబుతున్నామని, ప్రసంగాలు కాకుండా కవిత అప్రూవర్‌గా మారి ఫిర్యాదు చేయాలని సవాల్ విసిరారు.

# కేఏ పాల్ కూడా పార్టీ పెట్టారు

**ఎన్ని పార్టీలు వచ్చినా బీజేపీకి ఇబ్బంది లేదు: రాంచందర్ రావు**



**హైదరాబాద్, ఏప్రిల్ 25:**

రాష్ట్రంలో ఎన్ని పార్టీలు వచ్చినా బీజేపీకి ఇబ్బంది లేదని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. కల్వకుంట్ల కవిత ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర సేనపై ఆయన.. స్పందిస్తూ.. కోదండరాం, కేఏ పాల్ కూడా పార్టీ పెట్టారని వ్యాఖ్యానించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన జిల్లాస్థాయి నాయకుల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ.. ఎవరు పార్టీ ఏర్పాటు చేసినా, ప్రజల గురించి ఏ పార్టీ ఆలోచిస్తుందన్నది ముఖ్య మని అన్నారు. 'గతంలో టీఆర్ఎస్.. ఇప్పుడు బీఆర్ఎస్.. ఈ పార్టీకి పుట్టబోయే బిడ్డ పేరు కూడా టీఆర్ఎస్ అట.. ! వీరంతా కూడా రాష్ట్రాన్ని దోచుకోవడమే తప్ప చేస్తున్నదేమిటి?' అని ప్రశ్నించారు.

# ప్రెస్ క్లబ్ క్యాతనపల్లి నూతన కమిటీ ఎన్నిక

## జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా : అధ్యక్షులు పి.గట్టయ్య



**రామకృష్ణాపూర్, ఏప్రిల్ 25, (మన సమాజం):**
ప్రెస్ క్లబ్ క్యాతనపల్లి నూతన కార్యవర్గాన్ని శనివారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఎస్ఆర్కే పాఠశాలలో సమావేశమై నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షులు పిలుమాల్ల గట్టయ్య (మెట్రో ఈవినింగ్), ప్రధాన కార్యదర్శి మారపల్లి వేణుగోపాల్ రెడ్డి (ఆంధ్రప్రభ), కోశాధికారి అరెల్లి గోపికృష్ణ (మన సమాజం), లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారుగా ఈదునూరి సారంగారావు ( జనం సాక్షి), గౌరవాధ్యక్షులు ఆరంధ స్వామి ( సిటీ కేబుల్), వెంగళదాస్ సంతోష్ (మనం), తాంద్ర సతీష్ (ఆంధ్రజ్యోతి), వర్కింగ్ ప్రెసిడెంట్ కలువల శ్రీనివాస్( జర్నలిస్ట్ ), ఉపాధ్యక్షులు గంగారపు గౌతమ్ కుమార్ (ప్రజా పక్షం), పిడి రాజేంద్ర ప్రసాద్ (తెలంగాణ గళం), కొండ శ్రీనివాస్ (మన తెలంగాణ), బండ అమర్నాథ్ రెడ్డి (వుదయం), పురుషోత్తం గంగులు (ప్రజా దర్బార్), ప్రచార కార్యదర్శిగా నాంపల్లి గట్టయ్య (నేటిదాత్రి), సహాయ కార్యదర్శులుగా నెల్లూరి శ్రీనాథ్ ( సూర్య), నాసబత్తుల ప్రవీణ్ (నవ తెలంగాణ), దాసరి స్వామి (ప్రత్యక్ష సాక్షి) , ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కొమ్ము సదానందం( విజయ భారతీ), దుర్గం వెంకట స్వామి( టుడేస్ న్యూస్),మోరె రవీందర్(టీ మీడియా) లు ఎన్నికయ్యారు. అనంతరం నూతన అధ్యక్షులు గట్టయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయడంతో పాటు, ఇళ్ల స్థలాలు, ప్రెస్ క్లబ్ భవనాన్ని నిర్మిస్తానని సభ్యులకు హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ క్యాతనపల్లిని ఆదర్శ ప్రెస్ క్లబ్ గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. నూతన కమిటీని సభ్యులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# బెల్లంపల్లి పోలీసుల చొరవతో చల్లని
# నీటి కేంద్రం ఏర్పాటు చేసి ప్రజలకు ఉపశమనం



**బెల్లంపల్లి ఏప్రిల్ 25 (మన సమాజం) :**
ప్రజా సంక్షేమం పట్ల ప్రశంసనీయమైన నిబద్ధతను ప్రదర్శిస్తూ, తీవ్రమైన వేసవి తాపం నుండి ప్రజలను కాపాడటానికి బెల్లంపల్లి పోలీసులు రద్దీగా ఉండే కాల్టెక్స్ ఫ్లైఓవర్ టీ-జంక్షన్ వద్ద ఒక చల్లని నీటి కేంద్రాన్ని (చలివేంద్రం) ఏర్పాటు చేశారు. బెల్లంపల్లి సిఐ సి. హనోక్ నేతృత్వంలో చేపట్టిన ఈ చొరవ, ప్రయాణికులు, పాదచారులు, రోజువారీ కూలీలు మరియు బస్సుల కోసం వేచి ఉండే ప్రజలకు సురక్షితమైన, అందుబాటులో ఉండే తాగునీటిని అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. తీవ్రమైన వేడి వేళల్లో వీరే ఎక్కువగా ప్రభావితమవుతారు. స్థానిక పోలీసు అధికారుల సమక్షంలో మంచిర్యాల డిసిపి భాస్కర్, బెల్లంపల్లి ఎసిపి కిరణ్ కుమార్ శనివారం ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ప్రయత్నం చట్ట అమలు విధులకు అతీతంగా సమాజ ఆధారిత పోలీసింగ్ మరియు ప్రజా సేవ పట్ల పోలీసు శాఖ యొక్క నిబద్ధతను ప్రతిబింబిస్తుందని అన్నారు. శీతలీకరణ నీటి కేంద్రం సమర్థవంతంగా పనిచేస్తోంది మరియు పోలీసుల యొక్క ఈ ఆలోచనాత్మకమైన, సకాల చర్యను ప్రజలు అభినందించి, ఇప్పటికే సానుకూల స్పందనను పొందారు. ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్న ఈ తరుణంలో, ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమైన ఉపశమనాన్ని అందిస్తూ, పోలీసులకు మరియు సమాజానికి మధ్య బంధాన్ని బలపరుస్తున్నాయి.



# మే 9న తెలంగాణకు ప్రధాని మోదీ పర్యటన

**అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం - పరేడ్ మైదానంలో భారీ సభకు ఏర్పాట్లు**

**ఎంఎంటీఎస్ ఫేజ్-2, ఎయిమ్స్ అంకితానికి అవకాశం**

**జాతీయ రహదారులకు శంకుస్థాపన సూచనలు**



**హైదరాబాద్, ఏప్రిల్ 25**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెలలో తెలంగాణ రాష్ట్రాన్ని సందర్శించనున్నారు. మే 9వ తేదీన ఆయన రాష్ట్ర పర్యటన ఖరారైనట్లు సమాచారం. ఈ పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు హైదరాబాద్ నగరంలోని పరేడ్ మైదానంలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. మూడోసారి ప్రధానమంత్రి పదవిని చేపట్టిన తర్వాత మోదీ తెలంగాణకు రావడం ఇదే మొదటిసారి కావడం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల అనంతరం ఈ పర్యటన జరగనుండటం రాజకీయంగా కూడా ఆసక్తికరంగా మారింది. పర్యటనలో భాగంగా ఎంఎంటీఎస్ ఫేజ్-2 ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్నట్లు తెలుస్తోంది. నగర రవాణా వ్యవస్థను మెరుగుపరచే ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రయాణికులకు మరింత సౌలభ్యం కలగనుంది. అలాగే బీబీనగర్‌లో నిర్మించిన ఎయిమ్స్ ఆసుపత్రిని కూడా జాతికి అంకితం చేసే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.ఇదే సమయంలో రాష్ట్రంలో పలు జాతీయ రహదారి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసే అవకాశముంది. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర మౌలిక వసతుల అభివృద్ధికి తోడ్పడనున్నాయి. రవాణా సౌకర్యాలు మెరుగుపడి ఆర్థిక కార్యకలాపాలకు ఊతం లభించనుంది. మల్లారెడ్డి యూనివర్సిటీలో నిర్వహించే కార్యక్రమానికి కూడా ప్రధాని మోదీని ఆహ్వానించినట్లు సమాచారం. అయితే ఆయన ఆ కార్యక్రమానికి హాజరవుతారా లేదా అనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.ప్రధాని పర్యటన నేపథ్యంలో బీజేపీ పార్టీ భారీ ఏర్పాట్లు చేపడుతోంది. ఈ పర్యటనతో తెలంగాణ రాజకీయాల్లో చైతన్యం పెరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. అభివృద్ధి కార్యక్రమాలు, రాజకీయ సందేశాలతో ఈ పర్యటన కీలకంగా మారనున్నది.

# డీజీపీ పదోన్నతి అధికారులతో సీఎం భేటీ

**అభినందనలు తెలిపిన రేవంత్ రెడ్డి - ఐసీసీసీలో మర్యాదపూర్వక సమావేశం**

**సీనియర్ పోలీసు అధికారులకు శుభాకాంక్షలు - భద్రతా వ్యవస్థ బలోపేతంపై దృష్టి**



**హైదరాబాద్, ఏప్రిల్ 25**
డీజీపీ ర్యాంకు పదోన్నతి పొందిన సీనియర్ పోలీసు అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఐసీసీసీ కేంద్రంలో జరిగిన ఈ సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ పదోన్నతి పొందిన అధికారులు వి.వి. శ్రీనివాస రావు, స్వాతి లక్రా, మహేష్ భగవత్, చారు సిన్హా, డా. అనిల్ కుమార్, వి.సి. సజ్జనార్ ముఖ్యమంత్రిని కలుసుకున్నారు. సమావేశంలో ముఖ్యమంత్రి వారికి అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరింత బాధ్యతతో విధులు నిర్వర్తించాలని [redacted]చించారు. రాష్ట్రంలో [redacted]తలు కాపాడడంలో పోలీసు విభాగం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. పోలీసు వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపై ఈ సందర్భంగా చర్చ జరిగినట్లు సమాచారం. పదోన్నతి పొందిన అధికారుల అనుభవం, నైపుణ్యం రాష్ట్ర భద్రతా వ్యవస్థకు తోడ్పడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రజల భద్రత, శాంతి కాపాడటంలో అధికారులు సమర్థంగా పనిచేయాలని సూచించారు. ఈ భేటీ పోలీసు వ్యవస్థలో ఉత్సాహాన్ని పెంచడంతో పాటు, భవిష్యత్తులో మరింత సమర్థవ[redacted]మైన సేవలకు దోహదప[redacted]ి అధికారులు పేర్కొన్నారు.

# ఊళ్లు ఖాళీ యువత పట్టణాల బాట

**ఉద్యోగాల కోసం భారీ వలసలు.. గ్రామాలకు వీడ్కోలు**

**వ్యవసాయం సంక్షోభం.. కొత్త తరం వెనుదిరుగు**

**గ్రామాల భవిష్యత్తు సంక్షోభంలో - సమగ్ర చర్యల అవసరం**



**హైదరాబాద్, ఏప్రిల్ 25**
దేశ అభివృద్ధికి పునాది అయిన గ్రామీణ ప్రాంతాలు నేడు ఒక మౌన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ఉపాధి అవకాశాలు, మెరుగైన జీవన ప్రమాణాలు, విద్యా సౌకర్యాల కోసం యువత పెద్దఎత్తున పట్టణాలకు వలస వెళ్తుండటంతో ఊళ్లు క్రమంగా ఖాళీ అవుతున్నాయి. ఒకప్పుడు కృషితో, ఉత్సాహంతో కళకళలాడిన గ్రామాలు నేడు నిశ్శబ్దంగా మారిపోతున్నాయి. పట్టణాల్లో ఉద్యోగాల ఆకర్షణ యువతను బలంగా ప్రభావితం చేస్తోంది. సమాచార సాంకేతిక రంగం, సేవా రంగం, నిర్మాణ రంగాల్లో అవకాశాలు ఉండటంతో గ్రామాల నుంచి యువకులు నగరాలకు తరలిపోతున్నారు. గ్రామాల్లో సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడం, కృషికి తగిన ప్రతిఫలం రాకపోవడం ఈ వలసలకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.వ్యవసాయం ఒకప్పుడు గ్రామీణ జీవితానికి కేంద్రంగా ఉండేది. కానీ ప్రస్తుతం అది సంక్షోభంలో చిక్కుకుంది. పంటల పెట్టుబడులు పెరగడం, ఎరువుల ధరలు అధికమవడం, వాతావరణ మార్పుల ప్రభావం, మార్కెట్‌లో ధరల అనిశ్చితి వంటి సమస్యలు రైతు కుటుంబాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ పరిస్థితిని చూసిన యువత వ్యవసాయం వైపు ఆసక్తి చూపకపోవడం సహజమే. పట్టణాల్లో జీవితం ఆశించినంత సులభం కాకపోయినా, గ్రామాల్లో అవకాశాల లేమి కారణంగా యువత అక్కడే కొనసాగుతోంది. అధిక అద్దెలు, రోజువారీ ఖర్చులు, అస్థిర ఉద్యోగాలు, ఒత్తిడి వంటి సమస్యలు ఉన్నప్పటికీ, తిరిగి గ్రామాలకు వెళ్లే పరిస్థితి చాలా మందిలో కనిపించడం లేదు. ఇది శాశ్వత వలసలకు దారితీసే ప్రమాదాన్ని పెంచుతోంది.గ్రామాల్లో యువత లేకపోవడం వల్ల సామాజిక నిర్మాణం బలహీనమవుతోంది. వృద్ధులు మాత్రమే మిగిలి, వ్యవసాయ పనులు సాగించడం కష్టమవుతోంది. పాఠశాలలు విద్యార్థులు లేక మూతపడే దశకు చేరుకుంటున్నాయి. గ్రామీణ చిన్న వ్యాపారాలు క్రమంగా క్షీణిస్తున్నాయి. సంప్రదాయాలు, సంస్కృతి కూడా నెమ్మదిగా కనుమరుగవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించాలంటే సమగ్ర విధానాలు అవసరం. గ్రామాల్లోనే ఉపాధి అవకాశాలను సృష్టించాలి. చిన్న పరిశ్రమలు, ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు, పశుపోషణ, గ్రామీణ స్టార్టప్స్ వంటి రంగాలను ప్రోత్సహించాలి. ఆధునిక సాంకేతికతతో వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చాలి. డిజిటల్ సదుపాయాలు, రహదారులు, ఆరోగ్య సేవలు, విద్యా సంస్థలను బలోపేతం చేయాలి.యువత గ్రామాల్లోనే స్థిరపడేలా ప్రత్యేక పథకాలు రూపొందించాలి. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక సహాయం, మార్కెట్ సదుపాయాలు కల్పించాలి. గ్రామీణ అభివృద్ధి కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, సమాజం మొత్తం కలిసి తీసుకోవాల్సిన బాధ్యతగా భావించాలి. గ్రామాలు కేవలం నివాస స్థలాలు కాదు, దేశ సంస్కృతికి మూలాలు. వాటిని ఖాళీ చేయడం అంటే మన భవిష్యత్తును బలహీనపరచడం. యువత గ్రామాల్లోనే అవకాశాలు పొందేలా చర్యలు తీసుకుంటేనే ఈ వలసల ధోరణిని తగ్గించవచ్చు. గ్రామాలు బలంగా ఉంటేనే దేశం బలంగా నిలుస్తుంది.

# గంగానది ప్రతి బెంగాలీ గుండె చప్పుడు

**కోల్‌కతాలో ప్రధాని మోదీ ఆధ్యాత్మిక పర్యటన**

**గంగానది పట్ల బెంగాలీ ప్రజలకు ఉన్న అచంచల భక్తిని కొనియాడిన ప్రధాని**

**కోల్‌కతా, ఏప్రిల్ 24**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో పర్యటిస్తూ గంగా నది పట్ల బెంగాలీ ప్రజలకు ఉన్న లోతైన అనుబంధాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రతి బెంగాలీ హృదయంలో గంగానదికి అత్యంత విశిష్ట స్థానం ఉందని అది కేవలం నది మాత్రమే కాదని బెంగాల్ ఆత్మలోనే ప్రవహిస్తుందని ఆయన తన భావాలను పంచుకున్నారు. ఈ పవిత్ర జలాలు మన నాగరికత శాశ్వత చైతన్యాన్ని ముందుకు తీసుకువెళ్తాయని ఆయన అభివర్ణించారు. గంగానది భారతీయ సంస్కృతికి ఆధ్యాత్మికతకు ప్రతిబింబమని ముఖ్యంగా బెంగాల్ ప్రాంతంలో దీని ప్రభావం అపారమని మోదీ తన సందేశంలో స్పష్టం చేశారు. ఈ రోజు ఉదయం కోల్‌కతాలోని హుగ్లీ నది తీరంలో గడిపిన క్షణాలను ప్రధాని ఎంతో ఆత్మీయంగా గుర్తు చేసుకున్నారు. గంగా మాతకు తన కృతజ్ఞతలు తెలుపుకునే అవకాశంగా ఈ సమయాన్ని ఆయన భావించారు. నదీ తీరంలో ప్రశాంత వాతావరణంలో గడుపుతూ ఆ పవిత్ర నది పట్ల తనకున్న భక్తిని చాటుకున్నారు. గంగానది పరిశుభ్రత దాని పునరుజ్జీవనం కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలను దృష్టిలో ఉంచుకుని ఈ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. పర్యావరణ పరిరక్షణతో పాటు ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడటం తన లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా సూచించారు.తీరంలో గడిపిన సమయంలో ప్రధాని మోదీ అక్కడ ఉన్న స్థానిక ప్రజలను ముఖ్యంగా ఉదయం నడకకు వచ్చిన వారిని పడవ నడిపే వారిని కలిశారు. సాధారణ ప్రజలతో మమేకమై వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పడవ నడిపే వారు పడే అలుపెరగని శ్రమను ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. వారి కష్టం అభినందనీయమని నదీ తీర ఆర్థిక వ్యవస్థలో వారి పాత్ర కీలకమని ఆయన ప్రశంసించారు. సామాన్య పౌరులతో ఆయన జరిపిన ఈ సంభాషణలు అక్కడి వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ప్రజల కష్టాలను గుర్తించి వారిని ప్రోత్సహించడం తన బాధ్యతగా ఆయన భావించాహుగ్లీ నది తీరాన నిలబడి పశ్చిమ బెంగాల్ అభివృద్ధి పట్ల తనకున్న నిబద్ధతను ప్రధాని మోదీ మరోసారి చాటిచెప్పారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి గొప్ప బెంగాలీ సమాజం సుసంపన్నతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాల కల్పన నుండి సాంస్కృతిక విలువల పరిరక్షణ వరకు అన్ని రంగాలలో బెంగాల్‌ను ముందంజలో ఉంచుతామని ఆయన హామీ ఇచ్చారు. పశ్చిమ బెంగాల్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర ప్రగతిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. గంగానది కేవలం జలవనరు మాత్రమే కాక అది భారతీయతకు ఐక్యతకు చిహ్నమని మోదీ ఉద్ఘాటించారు. బెంగాల్ సంస్కృతిలో అంతర్భాగమైన ఈ నది తీరాన రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రణాళికలు రూపొందించడం శుభపరిణామమని ఆయన పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌ను అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని బెంగాలీ సమాజ శ్రేయస్సే తమ ప్రథమ ప్రాధాన్యమని ఆయన తన పర్యటన ముగింపులో తెలియజేశారు. ప్రధాని పర్యటనతో స్థానికుల్లో రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది ఇది అభివృద్ధి దిశగా సానుకూల సంకేతాలను ఇస్తోంది.

# తెలంగాణ రాజకీయాల్లో విస్ఫోటనం

**బీఆర్ఎస్‌పై కవిత ధాటిగా విమర్శలు -కేసీఆర్‌పై తిరుగుబాటు స్వరం**

**'సామాజిక తెలంగాణ' లక్ష్యంగా కొత్త ప్రయాణం**



**మేడ్చల్, ఏప్రిల్ 25**

తెలంగాణ రాజకీయ యవనికపై భారీ మార్పుకు నాంది పలికే సంఘటన చోటుచేసుకుంది. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన కల్వకుంట్ల కవిత తన రాజకీయ ప్రయాణాన్ని అధికారికంగా ప్రారంభించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో 'తెలంగాణ రాష్ట్ర సేన' పేరుతో కొత్త పార్టీని ప్రకటిస్తూ రాష్ట్ర రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన ప్రజలు, కార్యకర్తలు ఈ నిర్ణయానికి మద్దతు తెలుపుతూ సభను జనసముద్రంగా మార్చారు. ఈ సభలో కవిత బీఆర్ఎస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఉద్యమంతో ఏర్పడిన పార్టీ తన అసలు లక్ష్యాన్ని కోల్పోయిందని ఆరోపించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరకుండా ఉండటమే కాకుండా, సామాజిక తెలంగాణ భావన పూర్తిగా దెబ్బతిందని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి సంవత్సరాలు గడిచినా, సాధారణ ప్రజల జీవితాల్లో మార్పు కనిపించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుపై కవిత ఘాటు వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. "ఇప్పటి కేసీఆర్ ఒకప్పటి నాయకుడు కాదు.. ప్రజల మనిషి కాదు" అంటూ తీవ్ర విమర్శలు చేశారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా స్పందించే నాయకత్వం ఇప్పుడు కనిపించడం లేదని, ప్రజల కష్టాలు పట్టించుకునే ధోరణి తగ్గిపోయిందని అన్నారు. గతంలో చేనేత కార్మికుల సమస్యల సమయంలో కేసీఆర్ ప్రజల మధ్యకు వచ్చి పోరాడిన రోజులను గుర్తు చేస్తూ, ఇప్పుడు ఆ చైతన్యం కనిపించడం లేదని కవిత పేర్కొన్నారు. తాను చాలా కాలంగా మార్పు కోసం ఎదురు చూశానని, కానీ పరిస్థితుల్లో ఎలాంటి మార్పు లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం తనకు మరింత స్పష్టత ఇచ్చిందని తెలిపారు. తెలంగాణ ఆత్మను కాపాడేందుకు, ప్రజల హక్కుల కోసం పోరాడేందుకు కొత్త పార్టీ స్థాపించానని కవిత వెల్లడించారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు అందించే తెలంగాణ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజలకు సమాన ప్రాధాన్యం కల్పించే విధంగా తమ పార్టీ పనిచేస్తుందని చెప్పారు. ఈ కొత్త రాజకీయ ప్రయాణం ద్వారా రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని కవిత లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రజల మద్దతుతో త్వరలోనే రాజకీయంగా బలపడతామని, తెలంగాణ భవిష్యత్తును మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కవిత నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారి తీసే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ప్రజా దర్బార్‌తో సమస్యల పరిష్కారానికి నూతన దిశ

**పాలేరు లో వినూత్న కార్యక్రమం- ప్రజల ముంగిటకే అధికార యంత్రాంగం**

**ఒక్క అర్జీతో సమస్యలకు పరిష్కారం లక్ష్యం-రాష్ట్రవ్యాప్తంగా అమలు దిశగా ప్రయోగం**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**ఖమ్మం, ఏప్రిల్ 25**

ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితిని తొలగించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాలేరు నియోజకవర్గంలో భాగంగా రాయిగూడెం క్లస్టర్ పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాయిగూడెం, అజయ్ తండా, చెరువుమాదారం, మంగాపురం తండా, అప్పలనరసింహపురం, బుద్ధారం, కట్టుకాచారం, కొంగర, రాజారాంపేట, భైరవునిపల్లి గ్రామాల ప్రజలతో మంత్రి ముఖాముఖిగా సమావేశమై వారి సమస్యలను వినిపించారు. ప్రతి విజ్ఞప్తిని సావధానంగా పరిశీలిస్తూ, పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలు ఒకసారి అర్జీ పెట్టుకుంటే చాలు అధికారులే సమస్యలకు పరిష్కారం చూపే విధంగా వ్యవస్థను రూపొందిస్తున్నామని తెలిపారు. పారదర్శక పాలనలో భాగంగా ప్రజల వద్దకే అధికారులు వెళ్లి సమస్యలను పరిష్కరించే విధానం అమలు చేస్తున్నామని చెప్పారు. వెంటనే పరిష్కారం అయ్యే అంశాలను అక్కడికక్కడే పూర్తి చేస్తామని, సమయం పట్టే వాటికి గడువు నిర్ణయించి పూర్తి చేస్తామని వివరించారు. 'ప్రజా దర్బార్' ఒకరోజు కార్యక్రమం కాదని, నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను వినే చిత్తశుద్ధి ఉన్నందుకే ఇలాంటి కార్యక్రమాలు చేపడు తున్నామని చెప్పారు. ఎన్నికల తర్వాత ప్రభుత్వం అందరికీ చెందుతుందని, ఏ పార్టీకి చెందిన వారైనా వారి సమస్య న్యాయమైనదైతే ఖచ్చితంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పాలేరు నియోజకవర్గంలో చేపట్టిన ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయదగిన నమూనాగా మారుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈనెల 27వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, గృహనిర్మాణ శాఖలపై ప్రత్యేక సమీక్షలు నిర్వహించి, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి సమస్యలను వేగంగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి వేగం, పారదర్శకత కల్పించే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.



# పదో తరగతి భయం బలి

**మెదక్‌లో విద్యార్థిని ఆత్మహత్య - పరీక్షల ఫలితాలపై ఆందోళన**

**కుటుంబం ధైర్యం చెప్పినా తగ్గని భయం- విషాద ఘటనపై దర్యాప్తు ప్రారంభం**



**మెదక్, ఏప్రిల్ 25**

: పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అవుతానేమో అన్న భయంతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన మెదక్ జిల్లాలో చోటుచేసుకుంది. కొత్తపల్లి తండాకు చెందిన 16 ఏళ్ల బానోత్ సాయిప్రియ స్థానిక జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. ఇటీవల జరిగిన పరీక్షలకు హాజరైన ఆమె, ఫలితాలపై తీవ్ర ఆందోళనకు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పరీక్షలు ముగిసినప్పటి నుంచి సాయిప్రియ నిరంతరం దిగులుగా ఉండేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఫెయిల్ అవుతానేమో అన్న భయం ఆమెను మానసికంగా కలవరపరిచింది. ఈ విషయం గమనించిన తల్లి ఆమెకు ధైర్యం చెప్పి, ఫలితాలపై ఆందోళన చెందవద్దని సమాధానపరిచింది. అయినప్పటికీ ఆమె ఆందోళన తగ్గలేదని తెలుస్తోంది. శుక్రవారం కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో సాయిప్రియ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొంతసేపటి తర్వాత ఇంటికి వచ్చిన సోదరుడు ఈ విషయం గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. చిన్న వయస్సులోనే పరీక్షల ఒత్తిడికి గురై ప్రాణాలు కోల్పోవడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి తగ్గించేలా తల్లిదండ్రులు, పాఠశాలలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. పరీక్షలు జీవితంలో ఒక దశ మాత్రమేనని, ఫలితాలకంటే జీవితం ఎంతో విలువైనదని నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలను పంచుకోవాలని సూచిస్తున్నారు.

## ఆర్టీసీ సమ్మె విరమణ రోడ్డెక్కిన బస్సులు

**మంత్రుల ఉప సంఘం చర్చలు సఫలం**

**కార్మికులకు పదకొండు శాతం ఫిట్‌మెంట్ ప్రకటన**

**విలీనం అంశంపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు**



**హైదరాబాద్, ఏప్రిల్ 25**

తెలంగాణ రాష్ట్రంలో గత మూడు రోజులుగా ప్రజారవాణాను స్తంభింపజేసిన టీజీఎస్‌ఆర్టీసీ సమ్మె ఎట్టకేలకు ముగిసింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రుల ఉప సంఘంతో కార్మిక సంఘాల నాయకులు జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. ప్రభుత్వ హామీలతో సమ్మె విరమిస్తున్నట్లు జేఏసీ నాయకులు ప్రకటించడంతో ఏప్రిల్ ఇరవై రెండున ప్రారంభమైన నిరవధిక నిరసనలకు శుభం కార్డు పడింది. ఈ నిర్ణయంతో శనివారం ఉదయం తొలి షిఫ్ట్ నుంచే బస్సులు డిపోల నుండి బయటకు వచ్చి రోడ్డెక్కాయి. మూడు రోజులుగా రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు ఈ పరిణామంతో ఊపిరి పీల్చుకున్నారు. తెలంగాణ సచివాలయంలో శుక్రవారం అర్ధరాత్రి వరకు మంత్రుల బృందంతో కార్మిక నేతలు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా తమ ముప్పై రెండు డిమాండ్లతో కూడిన నివేదికను ప్రభుత్వం ముందు ఉంచారు. ముఖ్యంగా రెండు వేల ఇరవై ఒకటి రెండు వేల ఇరవై ఐదు సంవత్సరాలకు సంబంధించిన వేతన సవరణలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు ముప్పై శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని పట్టుబట్టినప్పటికీ ప్రభుత్వం ఆర్థిక పరిస్థితులను వివరించింది. కార్మికుల సమస్యలను సావధానంగా విన్న మంత్రుల బృందం వాటి పరిష్కారానికి సానుకూల అంగీకారం తెలపడంతో చర్చలు ఒక కొలిక్కి వచ్చాయి. చర్చల వివరాలను వెల్లడించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కార్మికులకు పదకొండు శాతం ఫిట్‌మెంట్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని ప్రకటించారు. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే అంశంపై లోతైన అధ్యయనం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రక్రియ కోసం అధికారులు కార్మిక సంఘాల నేతలతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీంతో పాటు కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలను కూడా త్వరలోనే నిర్వహిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ నిర్ణయాల పట్ల కార్మిక సంఘాలు సంతృప్తి వ్యక్తం చేశాయి. ఆర్టీసీ అనేది ప్రభుత్వంలో ఒక అంతర్భాగమని కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కార్మికులను తమ కుటుంబ సభ్యులుగా భావిస్తున్నామని వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ తలుపులు తెరిచే ఉంటాయని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పెద్దల నుంచి రాతపూర్వక హామీ లభించడంతో జేఏసీ నాయకులు సమ్మెను అధికారికంగా విరమించారు. రవాణా రంగం మళ్లీ గాడిలో పడటంతో రాష్ట్రవ్యాప్తంగా బస్టాండ్లు ప్రయాణికులతో సందడిగా మారాయి. ప్రభుత్వ స్పందన పట్ల కార్మిక వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల పరిధిలో బస్సు సర్వీసులు యథావిధిగా ప్రారంభమయ్యాయి. సమ్మె కారణంగా నిలిచిపోయిన సుదూర ప్రాంతాల సర్వీసులను కూడా అధికారులు పునరుద్ధరించారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు ట్రిప్పులు వేయాలని డిపో మేనేజర్లకు ఆదేశాలు అందాయి. ప్రభుత్వం కార్మికుల మధ్య కుదిరిన ఈ అవగాహన వల్ల రవాణా వ్యవస్థలో నెలకొన్న అనిశ్చితి తొలగిపోయింది. అభ్యర్థుల పరీక్షలు పనుల నిమిత్తం ప్రయాణించే వారికి ఈ సమ్మె విరమణ పెద్ద ఊరటనిచ్చింది. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు రాకుండా శాశ్వత పరిష్కారాలు చూపుతామని ప్రభుత్వం పునరుద్ఘాటించింది.



# తెలంగాణలో జనగణన సన్నాహాలు వేగం

**ప్రతి ఇంటి లెక్క తేల్చేందుకు చర్యలు- ప్రతి నిర్మాణం ప్రతి కుటుంబం లెక్కలోకి**

**రెండు దశల్లో జనగణన ప్రక్రియ - యాప్ ద్వారా 33 ప్రశ్నల సేకరణ**

**హైదరాబాద్, ఏప్రిల్ 25**

తెలంగాణలో జనగణన ప్రక్రియకు ప్రభుత్వం విస్తృత సన్నాహాలు చేపడుతోంది. జనగణన తెలంగాణ డైరెక్టర్ భారతి హోళికెరె మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర భౌగోళిక పరిధిలో ఉన్న ప్రతి ఇంటిని తప్పనిసరిగా లెక్కలోకి తీసుకుంటామని వెల్లడించారు. ఇళ్లు మాత్రమే కాకుండా ఆసుపత్రులు, పాఠశాలలు, దేవాలయాలు, గుడిసెలు, అద్దె భవనాలు వంటి అన్ని నిర్మాణాల గణన జరగనుందని స్పష్టం చేశారు. ఒకే భవనం లేదా కాంప్లెక్స్‌లో ఉన్న ప్రతి కుటుంబాన్ని విడివిడిగా పరిగణనలోకి తీసుకుంటామని ఆమె తెలిపారు. జనగణనలో ఎలాంటి కుటుంబం మిగలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ద్వారా రాష్ట్రంలో ఖచ్చితమైన జనాభా గణాంకాలు సేకరించడం లక్ష్యంగా ఉందన్నారు. జనగణనను రెండు దశల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి దశలో ఇళ్ల గణన, నిర్మాణాల గుర్తింపు పనులు జరుగుతాయని, రెండో దశగా 2027 ఫిబ్రవరిలో వ్యక్తిగత వివరాల సేకరణ ప్రారంభమవుతుందని చెప్పారు. ఇందుకోసం రాష్ట్రాన్ని బ్లాకులుగా విభజించి ఎన్యుమరేటర్లను నియమిస్తామని వెల్లడించారు. మే 11 నుంచి జూన్ 9 వరకు ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటిని సందర్శించి మార్కింగ్ ప్రక్రియను పూర్తి చేస్తారని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రత్యేక యాప్ ద్వారా వివరాలను నమోదు చేస్తారని చెప్పారు. ఈ యాప్ ద్వారా మొత్తం 33 ప్రశ్నలను అడిగి సమాధానాలను నమోదు చేయనున్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక మొబైల్ నంబర్‌ను నమోదు చేయడం తప్పనిసరిగా ఉంటుందని తెలిపారు. అలాగే భాష, ఇంటి పెద్ద పేరు వంటి వివరాలను సరిగ్గా ఇవ్వాలని సూచించారు.



ఒకసారి ఈ వివరాలు నమోదు చేసిన తర్వాత వాటిని మార్చడానికి అవకాశం ఉండదని ఆమె స్పష్టం చేశారు. జనగణనలో ప్రజలు పూర్తి సహకారం అందించాలని అధికారులు కోరుతున్నారు. ఖచ్చితమైన గణాంకాల సేకరణ ద్వారా ప్రభుత్వ విధానాలు మరింత సమర్థవంతంగా రూపొందించేందుకు ఈ ప్రక్రియ ఉపయోగపడుతుందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి ఈ జనగణన కీలకంగా నిలుస్తుందని అధికారులు అభిప్రాయపడ్డారు.



## ఒకే నెలలో మూడు సినిమాలు.. కృతిశెట్టి మళ్లీ ట్రాక్‌పైకి వచ్చేనా..?

తొలి సినిమాతోనే తెలుగులో గ్రాండ్ సక్సెస్ అందుకున్న భామల్లో ఒకరు కృతిశెట్టి. ఉప్పెన సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. అద్భుతమైన నటనతో కుర్రకారు మనసు దోచేసిన కృతిశెట్టి ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంది. కానీ ఆ తర్వాత చేసిన సినిమాలు మాత్రం కృతిశెట్టికి నిరాశనే మిగిల్చాయని చెప్పాలి. కృతిశెట్టి హీరోయిన్‌గా నటించిన కస్టడీ, మనమే, ది వారియర్, మాచెర్ల నియోజకవర్గం సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఈ వరుస ఫెయిల్యూర్స్ టాలీవుడ్‌లో కృతిశెట్టి ప్రయాణంపై ప్రభావం చూపించాయి. అయితే ఇక చేసేదేమి లేక తమిళంలో తన లక్‌ను పరీక్షించుకోవాలనుకున్నకృతిశెట్టి అక్కడ మూడు సినిమాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పాపులర్ యాక్టర్లతో సినిమాలు చేసి.. షూటింగ్స్ పూర్తి చేసినా పలు కారణాల వల్ల ఆలస్యమవుతూ వచ్చాయి. తీవ్ర నిరాశలో ఉండిపోయిన కృతిశెట్టి అభిమానుల కోసం వరుసగా ఆ సినిమాలు విడుదలకు రెడీ అయ్యాయి. పై మూడు సినిమాలు ఒకేసారి ఒకే నెలలో విడుదలకు ముస్తాబవుతున్నాయి. ఈ మూడు ప్రాజెక్టులు కూడా డిసెంబర్ నెలలోనే రిలీజ్ కాబోతుండటం విశేషం. కృతిశెట్టి కార్తీతో కలిసి నటిస్తున్న వా వాథియార్, ప్రదీప్ రంగనాథన్ లవ్ ఇన్సూరెన్స్, రవిమోహన్ సినిమాలు డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. మరి చాలా కాలంగా సరైన బ్రేక్ ఎదురుచూస్తున్న కృతిశెట్టికి ఈ డిసెంబర్ అయినా కలిసి రావాలని కోరుకుంటున్నారు అభిమానులు, ఫాలోవర్లు.

## హైప్ పెంచుతున్న మాస్టర్ మహేంద్రన్ వసుదేవసుతం టీజర్



దేవి సినిమాతో చైల్డ్ యాక్టర్‌గా సూపర్ క్రేజ్ సంపాదించుకున్నాడు మాస్టర్ మహేంద్రన్. ఈ టాలెంటెడ్ యాక్టర్ హీరోగా నటిస్తున్న చిత్రం వసుదేవసుతం. వైకుంఠ్ బోను డైరెక్ట్ చేస్తున్నాడు. టాలీవుడ్ యాక్టర్ సత్యదేవ్ ఈ మూవీ టీజర్‌ను లాంచ్ చేశాడు. ఈ కథ ధర్మానికి అడ్డొస్తే మేనమామ అయినా.. లక్షల బంధుగణమైనా.. ఎదురుగా కోట్ల సాయుధులే ఉన్నా.. ధర్మ హింస తథైవచ అన్న శ్రీ కృష్ణుడిదే కాదు.. ధర్మాన్ని కాపాడేందుకు ఎంతటి మారణ హోమానికైనా ఎదురెళ్లే యువకుడిది అంటూ సాగుతున్న డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. గుడి, గుప్త నిధి చుట్టూ తిరిగే సస్పెన్స్ ఎలిమెంట్స్‌తో సినిమా సాగన్నుట్టు టీజర్‌తో హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్. ఈ చిత్రంలో రాజీవ్ కనకాల, జాన్ విజయ్, మీమ్‌గోపి, తులసి, టార్జన్, రామరాజు, భద్రమ్, జబర్దస్త్ రాంప్రసాద్, శివన్నారాయణ, దువ్వాసి మోహన్, సుమేత బజాజ్, అంబికావాణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు స్పెషల్ అట్రాక్షన్ గా నిలువబోతున్నట్టు టీజర్ ద్వారా తెలిసిపోతుంది. ఈ మూవీ రిలీజ్ డేట్‌పై త్వరలోనే క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. ఈ చిత్రాన్ని రెయిన్‌బో సినిమాస్ బ్యానర్‌పై ధనలక్ష్మి బాదర్ల నిర్మిస్తున్నారు.



## అన్నీ ఇక్కడే నేర్చుకున్నా!

'మనస్సినక్కరే' (2003) అనే మలయాళ చిత్రం ద్వారా సినీ రంగ ప్రవేశం చేసింది అగ్ర కథానాయిక నయనతార. ఆ తర్వాత తమిళ, తెలుగు భాషల్లో అగ్ర కథానాయికగా పేరు తెచ్చుకుంది. ముఖ్యంగా 'చంద్రముఖి' 'గజిని' చిత్రాలు ఆమె కెరీర్‌ను మలుపుతిప్పాయి. ఇక అక్కడి నుంచి దక్షిణాదిలో అగ్ర నాయికగా చెలామణీ అయింది. అభిమానులు ఆమెను లేడీసూపర్‌స్టార్ అని ప్రేమగా పిలుస్తుంటారు. నయనతార ఇండస్ట్రీకి వచ్చి నేటితో 22 ఏండ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఈ భామ అభిమానులకు ధన్యవాదాలు తెలుపుతూ ఓ నోట్‌ను విడుదల చేసింది. 'నేను కెమెరా ముందుకొచ్చి 22ఏండ్లు గడచిపోయాయి. ఈ ప్రయాణం ఇంతదూరం సాగుతుందని అస్సలు ఊహించలేదు. ఇండస్టీకి వచ్చిన తర్వాతే వృత్తిపరంగా, వ్యక్తిగతంగా పరిణితి లభించింది. ఇక్కడే ఎన్నో కొత్త విషయాలను నేర్చుకున్నా. ఓ రకంగా సినీరంగం నాలో ధైర్యాన్ని నింపింది. నన్ను కొత్తగా పరిచయం చేసింది. ఈ ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచిన అభిమానులందరికి కృతజ్ఞతలు' అని నయనతార పేర్కొంది.

## ఆ చాన్స్ వస్తే బాగుంటది!

'సాధారణంగా ఇద్దరమ్మాయిలు, ఓ అబ్బాయి అంటే ముక్కోణపు ప్రేమకథ అనుకుంటారు. కానీ ఈ సినిమాలో ఓ యూనిక్ పాయింట్ ఉంటుంది. అదేంటో ఇప్పుడే చెప్పకూడదు. సినిమా చూసి తెలుసుకోవాల్సిందే' అని చెప్పింది శ్రీనిధి శెట్టి. ఆమె సిద్ధు జొన్నలగడ్డ సరసన ఓ నాయికగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసుకదా' ఈ నెల 17న విడుదలకానుంది. నీరజా కోన దర్శకురాలు. ఈ సందర్భంగా గురువారం పాత్రికేయులతో ముచ్చటించింది శ్రీనిధిశెట్టి. యాక్షన్, రక్తపాతం ఉన్న కేజీఎఫ్, హిట్-3 వంటి చిత్రాల తర్వాత ఓ ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ చేయడం సరికొత్త అనుభూతి అని చెప్పింది. ఈ సినిమాలో తాను రాగ అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, తన క్యారెక్టర్‌లో కొంచెం గ్రేషేడ్స్ కనిపిస్తాయని తెలిపింది. 'ఈ సినిమాలోని కొత్త పాయింట్ ప్రతీ ఒక్కరిని సర్‌ప్రైజ్ చేస్తుంది. లవ్, ఎమోషన్స్, కామెడీ.. ఇలా అన్ని అంశాల కలబోతగా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది. సిద్ధు జొన్నలగడ్డకు సినిమాకు సంబంధించిన ప్రతి క్రాఫ్ట్‌పై అవగాహన ఉంది. ఆయన టైమింగ్ బాగుంటుంది. ఇక రాశీఖన్నా క్రమశిక్షణ కలిగిన నటి. తన ఆహారపు అలవాట్లు, వర్కవుట్స్ అన్నీ పద్ధతిగా ఉంటాయి' అని శ్రీనిధి శెట్టి పేర్కొంది. వెంకటేష్-త్రివిక్రమ్ సినిమా కథానాయికగా ఎంపికయ్యారనే వార్తలపై స్పందిస్తూ 'నిజంగా ఆ విషయం నాకు తెలియదు. ఆ సినిమా ఛాన్స్ రావాలని కోరుకుంటున్నా.

